క్లుప్తంగా

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా చిన్నారులు నృత్యాలను ప్రదర్శించారు. పలు ప్రముఖ సినీగీతాలకు ఉల్లాసంగా, ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించారు. కడప నగరం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు, ఖాజీపేట వరల్డ్ డ్యాన్స్ అకాడమి చిన్నారులు చేసిన నృత్యాలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కడప రిమ్స్ జూడాలు కోల్‌కతా జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం పట్ల నిరసన ప్రదర్శన నిర్వహించారు. శిల్పారామం సందర్శకులకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. ఈ అంశంపై వేదికపై స్కిట్ ప్రదర్శించారు.

కేరళ వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కేరళ వరద బాధితులను ఆదుకోవాలని ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె మద్దిలేటి అన్నారు. ఆదివారం కడప నగరంలోని కళాక్షేత్రం నుంచి వైవీ స్ట్రీట్‌లో ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రానికి సంఘీభావంగా విరివిగా ఆర్థిక సహకారం అందజేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను వారికి అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర నాయకులు తారక రామారావు, నరసింహ, అంకుశం, సుబ్బారాయుడు, పుల్లయ్య, రామాంజనేయులు, వెంకటాద్రి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన పోరాటాలను మరువరాదని జేకే జనం కోసం సేవా సమితి అధినేత ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం కడప కోఆపరేటివ్ కాలనీలోని శ్రీ సాయిబాబా అనాథ శరణాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌కేఎస్ఎస్ అధినేత అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా, విద్యార్థులు పవన్‌బాషా, సాల్మన్, విలియమ్స్ పాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి



విలేకర్లతో మాట్లాడుతున్న భారత విద్యార్థి బ్లాక్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : తీవ్ర లైంగిక ఆరోపణలు ఉన్న కృష్ణారెడ్డిని వైవీయూ ఇన్‌చార్జి వీసీగా నియమించడం తగదని, తక్షణమే తొలగించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్(ఏబీవీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ కృష్ణారెడ్డి గతంలో కృష్ణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌గా పని చేసే సమయంలో ఉద్యోగులు, విద్యార్థులను లైంగిక వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఈ విషయమై ఒక టిన్నర సంవత్సరానికే ప్రభుత్వం కమిటీ వేసి సస్పెండ్ చేసిందని అన్నారు. యోగివేమన యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా ఉండి తన వైఖరి ఏమాత్రం మార్చుకోకుండా ఇదే పద్ధతుల్లో వ్యవహరించిన తీరు స్పష్టంగా యూనివర్సిటీ మొత్తం గమనించిందన్నారు. కమిటీ వేసి విచారణలో ఆరోపణలు వాస్తవం అని తేల్చి ప్రిన్సిపాల్‌గా తొలగించిందన్నారు. అయితే ప్రభుత్వం, ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ఇలాంటి వ్యక్తిని ఏ విలువలతో నియమించిందో విద్యాశాఖ మంత్రి లోకేష్ సమాధానం చెప్పాలని అన్నారు. కృష్ణారెడ్డి నియామకాన్ని వెనక్కి తీసుకోకపోతే పోరాటం చేయడంతో పాటు గవర్నర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ నాయకులు వినయ్, ప్రతాప్‌రెడ్డి, సంతోష్‌లు పాల్గొన్నారు.

రక్తదానం

కడప కల్చరల్ : ప్రముఖ సినీ నటులు చిరంజీవి జన్మదిన వారోత్సవాల సందర్భంగా స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో జనసేన నాయకులు తుంగా రమణయ్య, స్థానికప్రముఖులు శ్రీకాంత్, చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు పంద్రా రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

అతివలు అదుర్స్

- ఫొటోగ్రఫీలో రాణిస్తున్న అమ్మాయిలు
- కడప నగరంలో శిక్షణ
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటో టేకింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కడప కల్చరల్ : ఫొటోగ్రఫీ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ రంగంలో మహిళలు ఉండటం చాలా తక్కువ. పెద్ద నగరాల్లో మాత్రమే ఒకరిద్దరు మహిళా ఫొటోగ్రాఫర్లు కనిపిస్తారు. వారసత్వంగా కూడా మహిళలు ఈ రంగంలోకి రావడం అరుదు. అలాంటి తరుణంలో కడప నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫొటోగ్రఫీలో సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో అవసరమైన మేరకు శిక్షణ ఇస్తున్నారు. వారు ఈ రంగంలో నిలదొక్కుకునేందుకు అవసరమైన నైపుణ్యాలను అందిస్తున్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అందిస్తున్న కథనం.

కడప నగరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్)లోని ఎకనామిక్స్ లెక్చరర్ డాక్టర్ మార్తల గురుమోహన్‌రెడ్డికి ఫొటోగ్రఫీపై మక్కువ ఎక్కువ. దీంతో హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో ఏడాది పాటు సర్టిఫికెట్ కోర్సు చేశారు. ఈ రంగంలో ఎక్కడ ఎవరు శిక్షణ ఇస్తున్నా వెళ్లి అందులోని నైపుణ్యాలను అందిపుచ్చుకుంటున్నారు. లైటింగ్, ప్రకృతిలోని సహజత్వంలను కలిపి ఫొటోలను తీస్తుంటారు. అవసరమైన లైటింగ్ కోసం ఐదారు గంటలు వేచి చూస్తారు. మంచి యాంగిల్, స్పష్టత దొరికినంత వరకు వదలరు. దీన్ని గమనించిన పలువురు భావితరాలు ఈ రంగంలో కొనసాగేందుకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. దాంతో ఆయన తన కళాశాలలోని చురుకైన అమ్మాయిలను ఎంపిక చేసుకుని అధికారుల అనుమతితో వారికి ఫొటోగ్రఫీలో సంవత్సరం పాటు సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికి 50 మందికి పైగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం బ్యాచ్‌లో 30 మంది శిక్షణ పొందుతున్నారు. అమ్మాయిలంతా ఎంతో చురుగ్గా, సమయస్ఫూర్తి ప్రదర్శిస్తూ తమదైన క్రియేటివిటీతో ఫొటోలను తీస్తుండడం అందరినీ అబ్బురపరుస్తోంది. గురువు గురుమోహన్‌రెడ్డి కూడా ఖరీదైన ఎక్విప్‌మెంట్‌ను సేకరించి ఆధునిక ఫొటోగ్రఫీలోని నైపుణ్యాలను వారికి అందేలా కృషి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మహిళా ఫొటోగ్రాఫర్లు ఉన్నారంటే వారు తప్పకుండా గురుమోహన్‌రెడ్డి శిష్యులే అయి ఉంటారు. ప్రస్తుతం వీరిలో శ్వేతతో పాటు మరో నలుగురైదుగురు ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లుగా కొనసాగుతున్నారు.



కెమెరాలతో ఫొటోగ్రఫీ విద్యార్థినులు

ఉజ్వల భవిష్యత్తు



ఈ రంగాన్ని సీరియస్‌గా తీసుకుంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఇప్పటికే ఈ రంగంలో నా విద్యార్థులు కొందరు నిలదొక్కుకున్నారు. మహిళా ఫొటోగ్రాఫర్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఓపిక, పట్టుదల ఉంటే తప్పక రాణిస్తారు.

– డాక్టర్ మార్తల గురుమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, కడప

మంచి ప్రోత్సాహం



మహిళా ఫొటోగ్రాఫర్‌గా తొలి దశలో నేను గురువు గారి ప్రోత్సాహంతో నిలదొక్కుకుంటున్నాను. మహిళల ఫంక్షన్లలో నాకు అధిక ప్రాధాన్యత లభిస్తోంది. జిల్లా అంతటా తిరిగి మహిళల అభిరుచి మేరకు ఫొటోలు తీస్తున్నాను.

– శ్వేత, యువ మహిళా ఫొటోగ్రాఫర్, కడప

కొత్త కెరటాలు



మహిళలు ఫొటోగ్రఫీ రంగంలోకి రావడం మంచి పరిణామం. ఈ రంగంలో ఒక లోటు తీరినట్లే. డాక్టర్ గురుమోహన్‌రెడ్డికి ఈ రంగంలో గల ఇష్టం కళాశాల విద్యార్థులను ఫొటోగ్రాఫర్లుగా తీర్చిదిద్దుతోంది. మెంటార్‌గా వారికి శిక్షణ ఇచ్చే అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నాను.

– హరి, ఫొటోగ్రఫీ మెంటార్, కడప

ఫొటోగ్రాఫర్లకు చేయూత ఇవ్వాలి



ఖాసీం సాగర్‌ను సన్మానిస్తున్న టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు

కడప కార్పొరేషన్ : ఫొటోగ్రాఫర్లకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలని టూ వీలర్స్ అసోసియేషన్ నగర ఉపాధ్యక్షుడు జేకే ఖాదర్ బాషా అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆదివారం కడప నగరానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ ఖాసీం సాగర్‌ను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, వైఎస్సార్‌లు ముఖ్యమంత్రులుగా ఉన్న సమయాల్లో పౌర సంబంధాల శాఖ తరఫున ఖాసీం సాగర్ సేవలందించారని గుర్తు చేశారు. 1994 నుంచి 2009 వరకు కడప జిల్లాలో ఫ్రీలాన్స్ ఫొటోగ్రాఫర్‌గా సేవలందించారని, ఇలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఏఎస్‌కే కరిముల్లా, బాషా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య చర్యలు చేపట్టాలి

కడప కార్పొరేషన్ : నగర పాలక సంస్థ పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని కడప మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. ఆదివారం నగర పరిధిలోని కొండాయపల్లె ప్రాంతంలో పెద్ద కాలువల పూడికలను ఆయన పరిశీలించి వెంటనే శుభ్రపరిచాలని సూచించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలోని అన్ని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాల ఎదుట మంగళవారం ఉదయం 10.30 గంటలకు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చిందని రీజినల్ కార్యదర్శి వై.రవీంద్రనాథవర్మ ఒక ప్రకటనలో తెలిపారు. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కోఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 18–28 సంవత్సరాల మధ్య వయసు కలిగి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాసై లేదా ఫెయిల్ వారు ఇందుకు అర్హులన్నారు. 35 రోజులపాటు బెంగళూరు నగరంలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 90004 87423 అనే ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కరోనా కష్టకాలంలో తీసుకొచ్చిన 2020 మున్సిపల్ చట్ట సవరణల జీవోలు 197,198,199 ద్వారా ప్రతి ఏటా ఆస్తి పన్నులు పెరిగి ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతున్నదని, వెంటనే ఈ జీవోలను రద్దు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఉద్దే మద్దిలేటి పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరం ఎన్జీఓ కాలనీలోని ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ముద్దల సురేష్ బాబు, రేష్మా దంపతులు తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కుమార్తె సుహిత షారోన్ 16వ పుట్టిన రోజు సందర్భంగా తమ స్వగృహంలో నిరుపేద మహిళలకు చీరలు, కేకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు రాజు, శ్యామల, రేచల్, మనోహర్, నిర్మల, సువార్త, శోభ, భారతి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి వితరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్ సీఈసీ విభాగంలో 930 మార్కులు సాధించిన కె.హారిక అనే విద్యార్థికి అదే కళాశాలలో పని చేస్తున్న సివిక్స్ లెక్చరర్ బి.విజయ రూ. 10,116లను అందజేశారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని తల్లిదండ్రులు అధ్యాపకురాలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అలరించిన అక్కినేని నృత్యాలు





అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు, అక్కినేని గీతాలకు నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : ప్రముఖ సినీ సీనియర్ నాయకులు దివంగత అక్కినేని నాగేశ్వరరావును అనుకరిస్తూ ఆదివారం స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో పలువురు యువకులు సినీ, నృత్యాభిమానులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. అక్కినేని శతసంవత్సరాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అక్కినేని అభిమానులు ఆయనను అనుకరిస్తూ నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్‌గా లయన్ కె.చిన్నపరెడ్డి, అధ్యక్షులుగా ఆచార్యమూల మల్లికార్జునరెడ్డి, గౌరవ అతిథులుగా ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి, సవేరా ఆర్ట్స్ వెంకటయ్య తదితరులు హాజరయ్యారు. అక్కినేని నాగేశ్వరరావు జీవనయానం, సినీరంగ ప్రవేశం, సాధించిన విజయాలు, సమాజంపై ఆయన ప్రభావం, సినీ రంగంలో అందించిన సేవల గురించి కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మ్యాజిక్ షో, అక్కినేని పాటల ఆలాపన తదితరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.

కోల్‌కతా సంఘటనపై నిరసన






కొవ్వొత్తులతో మున్సిపల్ కమిషనర్, ఉద్యోగుల నిరసన, పీఆర్ఎస్ వైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

కడప కార్పొరేషన్ : పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతాలో పీజీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటనపై నగరపాలక కమిషనర్ వైఓ నందన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళా పీజీ డాక్టర్‌పై జరిగిన అత్యాచార ఘటన అమానుషమని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

కడప ఎడ్యుకేషన్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పైన హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పీఆర్ఎస్ వైఎఫ్) ఆధ్వర్యంలో కడపలోని ప్రభుత్వ ఎస్సీ–2 బాలికల కళాశాల వసతి గృహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటేష్, తేజ, దస్తగిరి, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సీమలోని ప్రాజెక్టులను నీటితో నింపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమ కరువు రైతులకు వ్యవసాయంలో ఇబ్బందులు లేకుండా కనీస పంటలు పండాలంటే, శ్రీశైలం ప్రాజెక్టు సామర్థ్యం 854 అడుగుల వరకు తగ్గకుండా నీరు ఉండాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేసి రైతులను కాపాడాలని పేర్కొన్నారు. నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు అంచుల వరకు ఉన్న తరుణంలో రాయలసీమ ప్రాంతంలో ఉన్న అన్ని నీటి రిజర్వాయర్‌లు నిండే వరకు శ్రీశైలం ప్రాజెక్టులో విద్యుత్తు ఉత్పత్తిని నిలుపుదల చేయాలన్నారు. ఇప్పుడు కూడా దిగువకు నీరు వదలడం ద్వారా రాయలసీమ రైతులకు తీరని ద్రోహం చేసిన వారు అవుతారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు ఆలోచించాల్సిన అవసరం వచ్చిందని గుర్తు చేశారు. శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల వరకు నీళ్లు ఉంచి రాయలసీమ కరవు నివారణ నుంచి కాపాడాలని ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రతినిధులు ఈ విషయమై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలని సూచించారు.

ఫుట్‌పాత్‌పై అడ్డంగా చెత్త డ్రమ్ములు



ఫుట్‌పాత్‌కు అడ్డంగా ఏర్పాటు చేసిన చెత్త డ్రమ్ములు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో కేఎఫ్‌సీ, మోహన్ హాస్పిటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌కు అడ్డుగా చెత్త డ్రమ్ములు ఏర్పాటు చేశారు. దీనివల్ల జనం నడిచేందుకు వీలు లేకుండా పోయింది. ఏ వ్యాపార సంస్థ అయినా తమ షాపు నుంచి వెలువడే చెత్తను ఒక కుండీలో ఏర్పాటు చేసుకొని చెత్త వాహనానికి అందించాలి. అంతే తప్ప ఇలా రహదారిపై, ఫుట్‌పాత్‌లపై పెట్టకూడదు. లక్షలు ఖర్చుపెట్టి ఫుట్‌పాత్‌లు నిర్మించింది ప్రజల నడకదారి కోసమే తప్ప, ఇలా చేయడానికి కాదని పలువురు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



జేసీ, డీఈఓల నుంచి బహుమతులు అందుకున్న హెచ్ఎం, విద్యార్థిని

కడప ఎడ్యుకేషన్ : కడప బాలోత్సవంలో కడప బుచ్చర్ స్ట్రీట్ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా విద్యాశాఖాధికారిణి మర్రెడ్డి అనురాధ, కడప ఎంఈఓ గంగిరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఆదివారం కడప ఎస్‌వీ ఇంజినీరింగ్ కళాశాలలో కడప బాలోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వక్తృత్వ, వ్యాసరచన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలలో బుచ్చర్ స్ట్రీట్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు హలీమ, ఆయేషా, రూహి, రోష్నిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కడప బాలోత్సవం నిర్వాహకులు మృత్యుంజయరావు, రాజశేఖర్ రాహుల్, సునీత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముహమ్మద్ దావూద్, బేపారి ఫక్రుద్దిన్‌లు పాల్గొని విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

జిల్లా ఉపాధి కల్పనాధికారికి సన్మానం



సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఏపీ మాలమహానాడు ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి అండెల సురేష్‌కుమార్ విశిష్ట సేవలు అందించి, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతున్నారని రాష్ట్ర మాలమహానాడు (జాకట విజయ శేఖర్ వర్గం) ప్రతినిధులు తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సురేష్‌కుమార్ మంత్రి ఫరూక్, కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదుగా సేవా పత్రం అందుకున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్, జిల్లా అధ్యక్షులు పాలెం సంజీవయ్య, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షులు డేవిడ్ సత్య రాజ్, ఏకాసి బాబు, రాజశేఖర్, మల్లి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించండి



అంగడి వీధిలో కాలువ ప్రక్కన పెరిగిన పిచ్చి మొక్కలు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 17/1 సచివాలయ పరిధిలో డోర్ నంబర్–89/4 సమీపంలో రోడ్డు, కాలువల వెంట పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. కంపచెట్లు, చెత్తాచెదారం ఎక్కువగా ఉండటం వల్ల పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. కాలువను శుభ్రపరిచి పిచ్చి మొక్కలను తొలగించాలని సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలను శుభ్రం చేసి విషపురుగుల నుంచి రక్షించాలని కోరుతున్నారు.

శుభ్రంగా ఉంచాలి

అంగడివీధిలో మా ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగాయి. కాలువ నిండా చెత్తాచెదారం నిండిపోయింది. కాలువ కనిపించకుండా మొక్కలు పెరిగాయి. దీనివల్ల దోమలు, పాములు ఎక్కువైపోయాయి. శుభ్రం చేయాలని కార్పొరేషన్ వారికి ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– డి.ఓబులమ్మ, అంగడి వీధి


బస్సులు లేక ప్రయాణికుల అవస్థలు





ప్రయాణికులకు తగినట్లుగా బస్సులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆదివారం కడప ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు చేరేందుకు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న సమయంలో తిరుపతి, తదితర ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో.. బస్సులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తగిన బస్సులు నడపడంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీసీ అధికారుల తీరును పలువురు ప్రయాణికులు తప్పుబట్టారు. ఈ విషయంగా డిపో మేనేజర్ డిల్లీశ్వరరావును సంప్రదించగా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా బస్సులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. – కడప కోటిరెడ్డిసర్కిల్

విద్యా నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న అధ్యాపకుడు వెంకటక్రిష్టారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు నిరంతరం విద్యా విషయ నైపుణ్యాన్ని పెంచుకుని, తరగతి గదిలో బోధన కొనసాగించాలని సీవీ రామన్ సైన్సు క్లబ్ కడప డివిజన్ గౌరవాధ్యక్షులు, మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ పత్తి వెంకటక్రిష్టారెడ్డి అన్నారు. కడపలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఆదివారం సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ సమావేశం నిర్వహించారు. కడప ప్రభుత్వ పురుషుల కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ రామచంద్ర పదో తరగతి భౌతిక శాస్త్రం నూతన టెక్స్ట్‌బుక్స్‌లోని కొన్ని కఠిన అంశాలపై తెలియచేశారు. కోటిరెడ్డి మహిళా కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు సుబ్రమణ్యం జీవశాస్త్రంలోని కఠిన అంశాలపై పలు సూచనలు చేశారు. డీవీ సుబ్బానాయుడు 2025 పబ్లిక్ పరీక్షల పత్రం బ్లూ ప్రింట్‌ను వివరించారు. అనంతరం సైన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ పత్తి వెంకటక్రిష్టారెడ్డి సైన్స్ క్లబ్‌కు అందించిన సేవలకు విద్యాభారతి రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగాధర్, సెక్రటరీ విజయప్రసాద్, మాజీ సైన్స్ ఆఫీసర్లు రెహమాన్, నిత్యానందరెడ్డి, సైన్స్ క్లబ్ మహిళా కార్యదర్శి సుజాత రాణి, సనావుల్లా, బాలకృష్ణ, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.